## తప్పు క్యాస్ట్ సర్టిఫికెట్‌తో ఎంబీబీఎస్ సీటు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్ కుమారుడి నిర్వాకం
- ధ్రువీకరణ పత్రం రద్దుకు కలెక్టర్ గెజిట్ నోటిఫికేషన్

సూర్యాపేట, అక్టోబర్ 16 : సూర్యాపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కర్పూరపు హర్షవర్ధన్ కుమారుడు ఎంబీబీఎస్ సీటు కోసం తప్పుడు కుల ధ్రువీకరణ సమర్పించినట్లు అధికారుల విచారణలో తేలింది. దాంతో ధ్రువీకరణ పత్రం రద్దుకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సూర్యాపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పని చేస్తున్న హర్షవర్ధన్ ఎస్సీ కులానికి చెందిన డాక్టర్ అరుణ జ్యోతిని ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ప్రణవ్ వర్ధన్, ప్రత్యూష్ ఉన్నారు. పెద్ద కొడుకు ప్రణవ్ వర్ధన్ నీట్-2022లో ఎస్సీ క్యాస్ట్ సర్టిఫికెట్‌తో ఎంబీబీఎస్ సాధించి నార్కెట్‌పల్లి కామినేని మెడికల్ కళాశాలలో జాయిన్ అయ్యాడు. బీసీ-డీ కులానికి చెందిన వ్యక్తి ఎస్సీ ధ్రువీకరణ పత్రంతో సీటు సాధించడం ఏంటని ఎస్సీ ఐక్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల మల్లేశ్ సూర్యాపేట కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో కలెక్టర్ విచారణకు అదనపు కలెక్టర్ బీఎస్ లత సారథ్యంలో నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. విచారణలో ప్రణవ్‌వర్ధన్ తప్పుడు కుల ధ్రువీకరణతో ఎంబీబీఎస్ సీటు సాధించారని విచారణలో తేలడంతో అతడి కుల ధ్రువీకరణ పత్రం రద్దు చేయాలని కలెక్టర్ గెజిట్ విడుదల చేశారు.



నల్లగొండలో ఫరీదొద్దీన్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి తదితరులు

# కాంగ్రెసోళ్ల ఇందిరమ్మ కమిటీలు

కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో కమిటీల జాబితాలు

చైర్మన్, కన్వీనర్లకు సంబంధం లేకుండానే ఫైనల్

- తుది జాబితాల కోసం ఎమ్మెల్యేల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు
- కమిటీల ఎంపికలోనే పారదర్శకతపై నీలినీడలు
- ఇండ్ల కేటాయింపు సామాన్యులకు దక్కడంపై సందేహాలు
- రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేయాలంటున్న విపక్ష నేతలు

## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల్లోనే కమిటీలకు తుదిరూపం

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్16(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో ఇస్తామని చెప్తున్న ఇందిరమ్మ ఇండ్లు రాజకీయాలకు అతీతంగా అర్హులైన సామాన్యులకు దక్కడంపై ఆదిలోనే అనుమానాలు మొదలయ్యాయి. లబ్ధిదారుల ఎంపికలో కీలకమంటూ ప్రభుత్వం చెప్తున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పాటు పూర్తిగా కాంగ్రెస్ నేతల కనుసన్నల్లో జరుగుతున్నది. గ్రామాలు, వార్డుల వారీగా కాంగ్రెస్ నేతలు సూచిస్తున్న వారినే సభ్యులుగా ఎంపిక చేస్తున్నారు. గ్రామ కమిటీల్లో కీలకమైన చైర్మన్, కన్వీనర్లుగా అధికారులు ఉండగా.. వారికి తెలియకుండానే కమిటీ సభ్యులను ఎంపిక చేస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. పూర్తిగా కాంగ్రెస్ నేతలు కూర్చుని గ్రామాల వారీగా జాబితాలను అందజేస్తే వాటికి ఆయా ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల్లో తుది రూపం ఇస్తుండడం గమనార్హం. ఫైనల్‌గా ఎమ్మెల్యేలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాక జాబితాలు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా కలెక్టర్లకు చేరుతున్నాయి. కాగా, మూడు రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరుగుతున్న కమిటీల ఎంపిక ప్రక్రియపై విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కమిటీల ఎంపిక తీరును చూసి ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకే పరిమితం అవుతాయన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల కమిటీల ఎంపికపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు అవుతుండగా, ఉన్నట్టుండి ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను ఒక్క రోజు తేడాతోనే పూర్తి చేయాలని ఈ నెల 11న ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. తెల్లారితే శనివారం.. అదీ దసరా రోజే తుది జాబితాలు అందజేయాలని పేర్కొంది. ఇంత అర్జెంట్‌గా కమిటీలు ఎలా అని అప్పుడే అధికారులు తలలు పట్టుకున్నారు. ఒకవేళ అదనపు శ్రమతో పూర్తి చేద్దామన్నా తమ చేతిలో ఏమీ లేదు. కమిటీలను నామినేట్ చేసే అధికారం ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు ఇచ్చినా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. కమిటీల జాబితాలన్నింటినీ తామే సిద్ధం చేసి అందజేస్తామని ఎమ్మెల్యేలు చెప్పారు. దాంతో అధికారులు ఎమ్మెల్యేలు, వారి పీఏలను తుది జాబితాల కోసం బతిమిలాడాల్సి వస్తున్నది. నల్లగొండ కలెక్టర్ మంగళవారమే కమిటీల ఎంపిక పూర్తి కావాలని కింది స్థాయి అధికారులకు డెడ్‌లైన్ విధించినా ఫలితం లేకపోయింది. గ్రామాల వారీగా జాబితాలు తుది దశకు వచ్చినా వాటికి స్థానిక ఎమ్మెల్యేలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. దాంతో ఒకటి, రెండ్రోజులు సమయం పట్టవచ్చని తెలుస్తున్నది.

### చైర్మన్, కన్వీనర్లకు తెలియకుండానే...

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి గ్రామ లేదా మున్సిపల్ వార్డు కమిటీలో ఏడుగురు సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసే కమిటీకి సర్పంచ్ లేదా స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా, ఇద్దరు స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామాభివృద్ధిలో కీలకమైన మరో ముగ్గురిని సభ్యులుగా నియమించవచ్చు. ఈ ముగ్గురిలోనూ ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ లేదా ఎస్టీ తప్పనిసరి చేశారు. గ్రామాల్లో కమిటీలకు సర్పంచ్‌లు లేకపోవడంతో స్పెషల్ ఆఫీసరే చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. పంచాయితీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. మెజార్టీ గ్రామాల్లో వారితో సంబంధం లేకుండా మిగతా ఐదుగురు సభ్యులను కాంగ్రెస్ నేతలే ఎంపిక చేశారు. ఎక్కువ చోట్ల మండలాల వారీగా కాంగ్రెస్ నేతలు కూర్చుని కమిటీల కూర్పును పూర్తి చేస్తున్నారు. దాంతో ఆయా గ్రామాల వారీగా కాంగ్రెస్ నేతలే ఇందులో సభ్యులుగా ఉండనున్నారు. ఇలా నియమించిన కమిటీల జాబితాను నేరుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల్లో అందజేశారు. అక్కడ ప్రస్తుతం కమిటీలకు తుది రూపం ఇస్తున్నారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీలో ఉండే అంతర్గత విబేధాలతో ఏకాభిప్రాయం రాలేదని, అలాంటి వాటిపై ఎమ్మెల్యేలు తుది నిర్ణయం తీసుకుంటున్నారని తెలుస్తున్నది. ఆ తర్వాతే ఆ కమిటీల తుది జాబితాలను తిరిగి మండలాల్లో ఎంపీడీఓలకు, పట్టణాల్లో కమిషనర్లకు కాంగ్రెస్ నేతలు అందజేస్తున్న పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి జాబితాలను కలెక్టర్ పంపి, ఫైనల్‌గా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో తుది కమిటీలను వెల్లడించనున్నారు.

### కమిటీలదే కీలక పాత్ర

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఈ కమిటీలదే కీలక పాత్ర కానుంది. కమిటీ ఆమోదంతోనే లబ్ధిదారుల ఎంపిక మొదలు అవగాహన కార్యక్రమాలు, ఇండ్ల నిర్మాణంలో సలహాలు, సూచనలు, ఫైనల్‌గా సోషల్ ఆడిట్‌ను కూడా కమిటీలే పర్యవేక్షిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్హులకు ఇండ్లు దక్కకపోవడం, అనర్హులకు ఇండ్లు వస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాల్సిన బాధ్యత కూడా కమిటీలపై ఉంది. కానీ ఎంపిక దశలోనే కమిటీల్లో పారదర్శకత లోపించడంతో ఎంతవరకు కమిటీల లక్ష్యం నెరవేరుతుందన్న సందేహాలు నెలకొన్నాయి. కమిటీల్లో కాంగ్రెస్ నేతలే కీలకం కావడంతో ఇండ్లను కూడా వారి కార్యకర్తలకే వచ్చేలా చూస్తారన్నది నిజం. దాంతో నిజమైన అర్హులకు ఇండ్లు దక్కుతాయా, లేదా అన్నది అనుమానంగా ఉంది. దీనివల్ల అర్హులు ఈ పథకానికి దూరమయ్యే అవకాశాలు లేకపోలేదు. రాజకీయ కక్షతో అర్హులైన ఇతర పార్టీల్లోని పేదలకు, ఎవరితోనూ సంబంధం లేని సామాన్యులకు ఇండ్లను దక్కనిస్తారా అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ఏర్పాటుపై గ్రామాల్లో విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఏకపక్ష జాబితాలపై విపక్ష నేతలు ఫిర్యాదు చేస్తున్నారు. పారదర్శకత లేకుండా ఎంపిక చేస్తున్న కమిటీలతో అర్హులకు న్యాయం ఎలా జరుగుతుందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

### నియోజకవర్గానికి 4 వేల ఇండ్లు

ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా రూ.5లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రకటించింది. గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమంలో వివిధ పథకాలతోపాటు ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులను స్వీకరించింది. ఇండ్ల నిర్మాణం కోసం వేలాది దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిగణలోకి తీసుకుంటారా, లేదా కొత్తగా స్వీకరిస్తారా అన్నది తేలాల్సి ఉంది. ప్రస్తుత ఏడాదికి నియోజకవర్గానికి నాలుగు వేల ఇండ్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 48వేల ఇందిరమ్మ ఇండ్లు ప్రస్తుతం రానున్నాయి.

# ఫరీదొద్దీన్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు

- తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఫరీద్
- మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ నివాళి

నల్లగొండ, అక్టోబర్ 16 : బీఆర్‌ఎస్ సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ ఫరీదొద్దీన్ అకాల మరణం బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ అన్నారు. నల్లగొండకు చెందిన ఫరీదొద్దిన్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మరణించారు. మాజీ మంత్రులు గుంటకండ్ల, మహమూద్ అలీ బుధవారం ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఫరీద్ కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫరీద్ మొదటి నుంచి బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పార్టీ ఇచ్చే ప్రతి పిలుపులోనూ పాల్గొని, మైనార్టీలను చైతన్యపరిచి ఉద్యమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేశారని గుర్తు చేశారు. జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శులు నిరంజన్ వలీ, చాడ కిషన్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చీర పంకజ్‌యాదవ్, కరీంపాష, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సింగం రామ్మోహన్, లక్ష్మి, జవహర్ లాల్, జమాల్ ఖాద్రీ, అభిమన్యు శ్రీనివాస్, కట్టా శ్రీను, జి.వెంకటేశ్వర్లు, గోలి అమరేందర్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.



అప్రూవల్ రాని పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

# ఉత్తుత్తి ఓపెనింగ్

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆర్భాటంగా ప్రారంభించిన మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

- తెచ్చిన పత్తిని అరగంట తర్వాత తిరిగి తీసుకెళ్లిన కనగల్ రైతు
- కొనుగోలు కేంద్రాలకు అప్రూవల్ రాక ముందే హైడ్రామా

నల్లగొండ, అక్టోబర్ 16 : నల్లగొండ బత్తాయి మార్కెట్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం ఎంతో ఆర్భాటంగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తమ మేలు కోరి మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చారని రైతులు సంతోషడే లోపు అదంతా హంబక్ అని తెలిసి తెల్లబోయారు. ప్రారంభించిన అర గంటకే కొనుగోలు కేంద్రాన్ని ఎత్తేయడంతో అందరూ ఖంగు తిన్నారు. అసలు సెంటరే లేని ప్రాంతంలో మినీ మాక్సీ వాహనంలో నాలుగైదు క్వింటాళ్ల పత్తిని తెప్పించి కొనుగోలు కేంద్రం ప్రారంభించినట్లు మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి ఫొటోలకు ఫోజులు ఇచ్చి.. పత్తి రైతులను బురిడీ కొట్టించారు. నల్లగొండ జిల్లా కేంద్ర శివారులోని ఎస్‌ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్‌లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు మంత్రులు హాజరు అవుతున్నారని ఒక రోజు ముందే అధికారులు ఫ్లెక్సీలు, ప్రకటనలు హోరెత్తించారు. బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఇద్దరు మంత్రులు ప్రారంభించి వెళ్లారు. ఆ తర్వాత కొద్ది సేపటికే కనగల్‌కు చెందిన రైతు తాను తీసుకొచ్చిన పత్తిని తిరిగి మినీ మాక్సీ వాహనంలో వేసుకుని తీసుకువెళ్లాడు. కేవలం పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కోసమే తీసుకువచ్చాడని తెలిసి రైతులు ముక్కున వేలు వేసుకున్నారు.



మంత్రులు వెళ్లిన అనంతరం పత్తిని తిరిగి వాహనంలోకి తీసుకెళ్తున్న రైతు

### అప్రూవల్ రాకుండానే ప్రారంభించేశారు!

నల్లగొండ జిల్లాలో 24 జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు పత్తి కొనుగోలుకు టెండర్లు వేశాయి. వాటికి సంబంధించి ఇప్పటి వరకు సీసీఐ యంత్రాంగం ఇన్‌స్టాలేషన్ చేయకుండా పెండింగ్‌లోనే ఉంచింది. వారి పని పూర్తయితే గానీ మార్కెటింగ్ యంత్రాంగం అప్రూవల్ ఇవ్వదు. కొనుగోలు కేంద్రాల ఎంపిక సీసీఐ దగ్గర పెండింగ్‌లో ఉండగా, మంత్రులు మాత్రం ఉత్తుత్తి కేంద్రం ప్రారంభించి పత్తి కొనుగోలు చేస్తున్నట్లు షో చేయడం విడ్డూరం.



పత్తి కొనుగోళ్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

## పత్తి కొనుగోళ్లకు 6 జిన్నింగ్ మిల్లులు

సూర్యాపేట, అక్టోబర్ 16 : జిల్లాలో పత్తి కొనుగోళ్లకు 6 జిన్నింగ్ మిల్లులను సిద్ధం చేసినట్లు సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి సీసీఐ అందించే మద్దతు ధరను పొందాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 78 వేల ఎకరాలలో పత్తి సాగు అయినట్లు తెలిపారు. సీసీఐ కనీస మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించిందన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలెంల వద్ద గల మంజిత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుమలగిరిలోని సిద్ధ ఫైబర్, సంతోషిమాత కాటన్ ఇండస్ట్రీస్, శ్రీనివాస జిన్నింగ్ మిల్లు, చింతలపాలెం మండంలోని డాక్టర్ అండ్ ఫ్రెండ్స్ కాటన్ జిన్నింగ్ మిల్లు, భారతమ్మ కాటన్ మిల్లులో కొనుగోళ్లకు అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధరలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని మార్కెట్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు తలెత్తితే టోల్ ఫ్రీ నెంబర్ 6281492368కు ఫోన్ చేయాలన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులు మిల్లుల వద్ద తూకాలను తనిఖీ చేయాలని సూచించారు. జిన్నింగ్ మిల్లుల వద్ద కంప్యూటర్లు, ప్రింటర్లు, వెబ్ కెమెరాలు, తూనికలు, ఫింగర్ ప్రింట్ స్కానర్లు, ఇంటర్నెట్ సదుపాయాలను ఏఎంసీ కార్యదర్శులు పరిశీలించి నివేదిక అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, మార్కెటింగ్ అధికారి సంతోశ్‌కుమార్, అగ్నిమాపక అధికారి జానయ్య, విద్యుత్ అధికారి ఉదయ్ భాస్కర్, డీఐసీ జనర్ మేనేజర్ సీతారాం, డీఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఫేక్ సర్టిఫికెట్లతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్

- ఒకే గ్రామంలో 11మంది అనర్హులకు అందజేత
- ఇద్దరు పంచాయతీ సెక్రటరీలు, ఏఆర్‌ఐపై సస్పెన్షన్ వేటు

సూర్యాపేట/నూతనకల్, అక్టోబర్ 16 : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు అనర్హులను ఎంపిక చేసిన విషయంలో ఇద్దరు పంచాయతీ సెక్రటరీలు, ఒక ఏఆర్‌ఐపై సస్పెన్షన్ వేటు పడింది. నూతనకల్ మండలం మాచనపల్లి గ్రామంలో 11 మంది అనర్హులు తప్పుడు ధ్రువపత్రాలతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందుకున్నారు. ఈ ఘటనపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఫిర్యాదు అందగా.. సూర్యాపేట ఆర్డీఓతో విచారణ చేయించారు. విచారణలో వాస్తవం తేలడంతో దిర్శినపల్లి పంచాయతీ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, మిర్యాల పంచాయతీ సెక్రటరీ అనిల్, క్షేత్ర స్థాయి విచారణ జరుపకుండా చెక్కులు అందించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన నూతకల్ అదనపు గిర్దావర్ లక్ష్మీప్రసాద్‌ను కలెక్టర్ బుధవారం సస్పెండ్ చేశారు.

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక హడావిడి షురూ..

మార్చి 29తో ముగియనున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ గడువు




- ఓటరు నమోదుకు నోటిఫికేషన్ విడుదల.. నవంబర్ 6 వరకు గడువు
- గతంలో నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలో 20,888 మంది ఓటర్లు
- ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన టీఎస్‌యూటీఎఫ్
- మిగిలిన సంఘాల్లో మద్దతు కోసం ఆశావహుల ప్రయత్నాలు

రామగిరి, అక్టోబర్ 16 : జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల హడావిడి మొదలైంది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29న ముగినుండగా.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తూ గత నెల 30న నోటిపికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఈ స్థానం నుంచి టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి, నల్లగొండ వాసి అల్గుబెల్లి నర్సిరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈసారి కూడా ఆయన పేరునే ఆ సంఘం ఖరారు చేసింది. గత ఎన్నికల్లో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 20, 888 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పీఆర్టీయూ, ఎస్‌టీయూ, టీపీయూఎస్‌తో పాటు మిగతా సంఘాలు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉండగా, ఆయా సంఘాల్లోని ఆశావహులు మద్దతు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సెప్టెంబర్ 30న రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు నమోదుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ఎన్నికల ఓటరు జాబితా రద్దు చేయడంతో పాటు.. నిబంధనల మేరకు అర్హులైన టీచర్లు (పాఠశాల విద్య, ఉన్నత విద్య) నవంబర్ 6లోగా ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దాంతో ప్రతి ఉపాధ్యాయుడు(టీచర్లు, అధ్యాపకులు) విధిగా తమ ఓటును కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తున్నది. వాస్తవానికి హైస్కూల్‌లో పని చేసే ఉపాధ్యాయులతోపాటు, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, యూనివర్సిటీ, పాలిటెక్నిక్, ఐఐటీల్లో అర్హులైన వారంతా ఓటు హక్కు కోసం ఎన్నికల కమిషన్ సూచించిన వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. మరోవైపు జిల్లా అధికారుల గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మూడేండ్లపాటు వరుసగా పని చేసేవారికీ అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయ సంఘాల నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ టీచర్ ఎమ్మెల్సీ ఓటు నమోదుపై చైతన్యం చేస్తుండడంతోనూ ఓటర్ల సంఖ్య పెరిగే చాన్స్ కనిపిస్తున్నది.


### ఉపాధ్యాయ సంఘాల సన్నాహాలు

టీఎస్ యూటీఎఫ్ ఇప్పటికే తమ అభ్యర్థిని ఖరారు చేయడంతో ఆ సంఘం నాయకులు సన్నహక సమావేశాలు, సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపడుతున్నారు. ఎస్టీయూతోపాటు పలు సంఘాల సభ్యత్వ నమోదు చేస్తున్నాయి. పీఆర్‌టీయూ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ నియమకాలు పూర్తి చేయడంతో ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు పీఆర్‌టీయూ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ ఈసారి పోటీ చేస్తారని వినిపిస్తుండగా, ఆ సంఘం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్ రెడ్డి పేరు తెరపైకి వస్తున్నది. టీపీయూఎస్ నుంచి సూర్యాపేట జిల్లాకు చెందిన సాయిరెడ్డి బరిలో ఉంటారని చెప్తున్నారు.

### డిసెంబర్ 30న టీచర్స్ ఎమ్మెల్సీ తుది ఓటరు జాబితా

- యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతు కే జెండగే

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 16: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి డిసెంబరు 30న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే జెండగే తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆయన సమీక్షించారు. భారత ఎన్నికల సంఘం వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి రివిజన్ షెడ్యూల్ విడుదల చేసినట్లు చెప్పారు. వచ్చే నవంబరు 6 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు ప్రకటించినట్లు చెప్పారు. నవంబరు 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించి, సవరణపై దరఖాస్తులను డిసెంబరు 9 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 25 వరకు వాటిని పరిష్కరించి, 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. భువనగిరి డివిజన్‌లో 12, చౌటుప్పల్ డివిజన్‌లో 5 పోలింగ్ కేంద్రాలతోపాటు మండలానికి ఒక్కటి చొప్పున మొత్తం 17 సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు బట్టు రామచంద్రయ్య, బట్టుపల్లి అనురాధ, ఆబోతుల కిరణ్ కుమార్, రత్నపురం బలరాం పాల్గొన్నారు.



నాగార్జున సాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

## మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు

8 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

నందికొండ, అక్టోబర్ 16 : నాగార్జున సాగర్ జలాశయం నిండుకుండలా తొణికిసలాడుతుండడతో బుధవారం డ్యామ్ క్రస్ట్ గేట్లను ఎత్తారు. సాగర్‌కు వరద పోటెత్తడంతో ఈ సీజన్‌లో మొదటిసారిగా ఆగస్టు 5న క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించి సెప్టెంబర్ 19 వరకు విడుదల చేశారు. రెండు విడుతల్లో 435 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకు గానూ ప్రస్తుతం 590 (312.0450 టీఎంసీలు) అడుగుల మేర నీటి నిల్వ ఉండడంతో బుధవారం ఉదయం 2 క్రస్ట్ గేట్ల ద్వారా ఎన్నెస్పీ అధికారుల నీటి విడుదలను ప్రారంభించారు. 16,200తో ప్రారంభించి క్రమంగా 8 గేట్లను ఎత్తి 64,800 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. సాగర్ రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లో ఆధారంగా క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను చేపడుతామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎడమ కాల్వ ద్వారా 6,022 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 6,253, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,907, వరద కాల్వ ద్వారా 400, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు, జల విద్యుత్ కేంద్రాలు, కాల్వల ద్వారా 1,08,782 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 93,707 క్యూసెక్కులు నమోదవుతున్నది.